క్లుప్తంగా

మంటలార్పిన సిబ్బంది



వాజేడు: మండల పరిధిలోని కడేకల్ గ్రామ సమీపంలోని పొలాల్లో శనివారం చెలరేగిన మంటలను అటవీ శాఖ సిబ్బంది, ఫైర్ సిబ్బంది ఆర్పారు. గ్రామ సమీపంలోని పొలాల్లో చెలరేగిన మంటలు అడవిలోకి వెళ్లే క్రమంలో గుర్తించిన అటవీ శాఖ గార్డు రామ్మూర్తి, సిబ్బంది పంపులతో నీటిని చల్లి చల్లార్పారు.

'సరోత్తంరెడ్డిని గెలిపించాలి'



ఏటూరునాగారం: బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఎమ్మెల్సీ జిల్లా ఇన్‌చార్జ్ వెన్నంపల్లి పాపయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తోందన్నారు. అనంతరం రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బలరాంను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి, కృష్ణాకర్, జాడి వెంకట్, సుదాకర్, ఏనుగుల రవీందర్‌రెడ్డి, జనార్ధన్, గాడిచర్ల రాజశేఖర్, ప్రణయ్, రవి, శ్రీను, అజిత్ పాల్గొన్నారు.

దారి మధ్యలో ఆగిన లారీ

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



వెంకటాపురం(కె): మండలంలోని యాకన్నగూడెం వద్ద దారి మధ్యలో లారీ టైర్ పంక్చర్ కావడంతో రహదారి సౌకర్యం లేక వాహనాలు నిలిచి పోయాయి. మండల పరిధిలోని యాకన్నగూడెం వద్ద బ్రిడ్జి కుంగడంతో వాహనాలు రాకపోకలను సాగించడానికి బ్రిడ్జి పక్కన మట్టి రహదారి పోశారు. శనివారం అటుగా వస్తున్న లారీ రహదారిపైకి రాగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో లారీ వెనుక వస్తున్న బస్సు నిలిచిపోయింది. అందులో ఉన్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఇతర శాఖల్లో పని చేసే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. కాగా చాలా సమయానికి లారీని బయటకు తీశాక ప్రయాణికులు వెళ్లారు. బ్రిడ్జి కుంగిపోయి రెండు నెలలు అవుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపించారు.

జీవన ఎరువులు అందించాలి


కన్నాయిగూడెం: రైతులు పంట పొలాలకు భూసారాన్ని పెంచే జీవన ఎరువులను అందించాలని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గూర్రేవుల, బుట్టాయిగూడెం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పీఎస్‌బీ బ్యాగులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

బిల్లులు ఆపాలని వినతి



వాజేడు: అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఆపాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయలకు తెలంగాణ ఆదివాసీ సంఘం మండల నాయకుడు జెజ్జరి దామోదర్, బచ్చలి కృష్ణబాబు శనివారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022–24 మధ్య కాలంలో మండలంలో సీసీ రోడ్లు, మన ఊరు –మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పలు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయలేదన్నారు. పనులు పూర్తి కాకుండానే బిల్లులను దక్కించుకోవాలని చూస్తున్నారని బిల్లులను నిలుపుదల చేయాలని కోరారు.

నగదు అందజేత



వాజేడు: మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో హెడ్ కుక్‌గా పని చేస్తున్న దుబ్బ కృష్ణవేణి(50) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. దీంతో ఆమె దహన ఖర్చులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.30 వేలను బాధిత కుటుంబానికి ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బద్రి శనివారం అందజేశారు. కృష్ణవేణి భర్త లక్ష్మ య్య నెల రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో మనోవేదనకు గురైన కృష్ణవేణి అనారోగ్యం బారిన పడి మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

ఏటూరునాగారం: పూజలు చేస్తున్న భక్తులు



కన్నాయిగూడెం: సమ్మక్కను వనప్రవేశం చేస్తున్న ఆదివాసీలు



గొంతెమ్మగుట్టకు సమ్మక్కను తీసుకెళ్తున్న భక్తులు



జనం నుంచి వనంలోకి..

- ముగిసిన మినీ జాతర
- భారీగా తరలివచ్చిన భక్తులు

ఏటూరునాగారం: మండలంలోని కొండాయిలో కొలువై ఉన్న గోవిందరాజులు, నాగులమ్మ, దొడ్లలోని సారలమ్మల మినీ జాతర శనివారం వనప్రవేశంతో ముగిసింది. కొండాయిలోని గద్దెల వద్ద నుంచి గోవిందరాజుల పడిగెను, వడెరాలను పూజారులు దబ్బగట్ల గోవర్ధన్, జనార్ధన్‌తోపాటు వడ్డెలు వారి గుళ్లల్లోకి చేరవేశారు. గుళ్లల్లో ఏర్పాటుచేసిన గోవిందరాజుల, నాగులమ్మ వడెరాలను (కుంకుమలతో నిండిన కుండలను) వనదేవతలు కొలువై ఉన్న గుట్టకు తీసుకెళ్లారు. దీంతో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయలతో నాలుగు రోజులపాటు జరిగిన జాతర ముగిసింది. కాగా అమ్మవార్లను గుట్టకు తీసుకెళ్లే క్రమంలో భక్తులు నేలపై పడుకొని వరం పట్టారు. సంతానం లేని దంపతులు సంతానం కావాలని, ఉద్యోగం లేని వారు ఉద్యోగం రావాలని ఇలా కోరిన కోర్కెలు తీరుతాయని వారి నమ్మకం. అదేవిధంగా మండలంలోని బనాజీబంధం గొంతెమ్మ గుట్టకు సమ్మక్కను పూజారులు, వడ్డెలు డప్పుచప్పుళ్లతో తీసుకెళ్లారు. మూడు రోజులపాటు అంగరంగవైభవంగా మినీ జాతర జరిగింది. ఆలం వంశీయులు(తలపతులు), కోరం వంశీయులు(వడ్డెలు) ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలు, భక్తులు అమ్మవార్లకు నీళ్ల ఆరబోసి గొంతెమ్మగుట్టకు చేరవేశారు.



కొండాయిలో వనదేవతలను తీసుకెళ్తున్న పూజారులు, భక్తులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మండలంలోని కొండాయిలో నాలుగు రోజుల పాటు జరిగిన మినీ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ మేరకు గ్రామంలో పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్యదర్శి సతీశ్ పర్యవేక్షించారు. శనివారం మండల పంచాయతీ అధికారి కుమార్ కొండాయి గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలని సిబ్బంది సూచించారు. గ్రామంలో మొత్తం బ్లీచింగ్ చల్లాలని, క్లోరినేషన్ చేయాలని, దోమల మందు పిచికారీ చేయించాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కన్నాయిగూడెం: సమ్మక్క–సారలమ్మ ఐలాపూర్ మినీ జాతర చివరి గట్టం వన ప్రవేశం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆదివాసీలు వారి సాంప్రదాయాతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవార్లను వనప్రవేశం చేశారు. గ్రామంలోని ఆడపడుచులు నిండుకుండా నీటితో తల్లికి ఆరగించి మొక్కుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మల్లెల రవి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భాస్కర్, సురేష్, తిరుపతి, శ్రీనువాస్ ఆలం సురేష్, లక్ష్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: గోవిందరాజుల గుడి వద్ద శుభ్రం చేస్తున్న జీపీ సిబ్బంది



ఏటూరునాగారం: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ కుమార్

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట: నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్ విద్యార్థినులు రక్షిత, జరుపుల వర్షిని, శ్రీవల్లిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ గండు కుమార్ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ చల్వాయిలో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు చూసి పిల్లల తల్లిదండ్రులు మోడల్ స్కూల్లో అడ్మిషన్ పొందాలని అన్నారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులను, ఉపాధ్యాయులు హారిక, మురళీకృష్ణ, ఎగ్జామినేషన్ బ్రాంచ్ రమేశ్‌లను ప్రిన్సిపాల్ అభినందిచారు. అనంతరం విద్యార్థులను శాలువాలతో సత్కరించారు.

వెంకటాపురం(కె)లో..



రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పడాల రామ్‌చరణ్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. దీంతో అతడిని ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ సత్యనారాయణ, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సుజాత, జయరాం, శేషు, నర్సింహారావు, వెంకటేశ్, రాజేశ్వరరావు, వంశీతో పాటు తదితరులు ఉన్నారు.

అడవులను కాపాడుకోవాలి



ములుకనపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఎఫ్‌ఎస్‌ఓలు నారాయణ, నాగమణి

వాజేడు: అడవుల్లో ఉండే చెట్లతోనే ప్రజలకు, ఇతర జీవాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని ప్రతి ఒక్కరూ అడవులను కాపాడాలని ఎఫ్‌ఎస్‌ఓలు నారాయణ, నాగమణి అన్నారు. మండల పరిధిలోని పూసూరు, ములుకనపల్లి గ్రామాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్ప పువ్వులు, చీపుర్లు సేకరించడానికి అడవికి వెళ్లిన ప్రజలు చెట్ల కింద సేద తీరే సమయంలో నిప్పు పెట్టవద్దన్నారు. ఒకవేల అడవిలో మంటలు అంటుకుంటే స్థానికులకు, అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాటు మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలని కోరారు. అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



వాజేడు: ఇసుక క్వారీని పరిశీలిస్తున్న ఎస్సై



ములుగు రూరల్: తనిఖీ చేస్తున్న పోలీసులు



వెంకటాపురం(కె)లో..

- ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్

వాజేడు: ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని రాంపురం, భీమవరం ఇసుక క్వారీలను తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీడీలో ఉన్న దాని కంటే ఎక్కువ లోడ్ చేసినా, ఒక లారీకి బదులు మరో లారీలో ఇసుక తరలించినా, జేసీబీతో నింపే సమయంలో డబ్బులు వసూలు చేసినా చట్ట పరంగా చర్యలను తీసుకుంటామని తెలిపారు.

ములుగు రూరల్: ములుగు మండలంలోని మల్లంపల్లి వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఇసుక లారీల్లో జీరో వెహికల్స్, ఓవర్ లోడింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ఒక లారీ ఓవర్ లోడ్‌తో రాగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల, సూరవీడు, ఆలుబాక ఇసుక క్వారీలను వెంకటాపురం(కె) ఎస్సై కొప్పుల తిరుపతిరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ డంపింగ్, ఓవర్ లోడింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వీరభద్రవరం గ్రామ సమీపంలో ఇసుక లారీలను తనిఖీలు చేశారు. ఆయన వెంట సివిల్, సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు

మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాగులు, వంకలు, గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తవ్వకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

100 రోజుల పని కల్పించాలి

- అదనపు డీఆర్డీఓ వెంకటనారాయణ

వెంకటాపురం(ఎం) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని అదనపు డీఆర్డీఓ వెంకటనారాయణ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈజీఎస్ పథకంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 23 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.2కోట్లతో 272 పనులు చేపట్టారు. అయితే ఆయా ప్రాంతాల్లో చేపట్టిన పనులపై వారం రోజులుగా సామాజిక బృందాలు తనిఖీ నిర్వహించి శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక (సోషల్ ఆడిట్) వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అవకతవకలకు పాల్పడిన ఈజీఎస్ సిబ్బంది నుంచి రూ.26,832లు రికవరీ చేయనున్నట్లు డీఆర్డీఓ వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడారు. ఈజీఎస్‌లో అవినీతిని అరికట్టేందుకు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈజీఎస్ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కూలీకి పని కల్పించాల్సిన బాధ్యత ఈజీఎస్ సిబ్బందిపై ఉందన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజు, ఏపీఓ నారగోని సునీత, డీవీసీ సాంబయ్య, ఎస్ఆర్‌పీ రజిత, సోషల్ ఆడిట్ ఏపీసీ అంజాగౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటనారాయణ

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడేనికి చెందిన సుస్మిత ఫోన్ ఇటీవల చోరీకి గురైంది. దీంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేశారు. ఈమేరకు బాధితురాలికి శనివారం ఎస్సై ఎస్సై వెంకటేశ్ అందజేశారు.

సేవాలాల్ జయంతి వేడుకలు



సేవాలాల్ జయంతి వేడుకల్లో అధ్యాపకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడాపాఠశాల, కళాశాల ఆవరణలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, టీచర్లు, ఉపాధ్యాయులతోపాటు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి సేవాలాల్ చిత్ర పటానికి పూలమాల వేసి ప్రత్యేక ప్రసాదాన్ని తయారు చేసి పంపిణీ చేశారు. అలాగే సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సేవాలాల్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవితేజ

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ ఎస్ఎంఎస్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ మండల కమిటీ సమావేశంలో రవితేజ మాట్లాడారు. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఆరు మండలాలు ఉన్నాయన్నారు. డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలు ఉన్నా విద్యార్థులకు హాస్టల్ లేకపోవడం వల్ల విద్యార్థులు చదువు దూరమవుతున్న అన్నారు. కార్యక్రమంలో బట్ట స్వామి, నర్సింగరావు, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవితేజ

బీమా చెక్కు అందజేత

కాటారం: కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో కాటారం పీఏసీఎస్‌లో పంట రుణం పొంది ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతుకు సంబంధించిన బీమా చెక్కును శనివారం పీఏసీఎస్ పాలకవర్గం, అధికారులు బాధిత కుటుంబానికి అందజేశారు. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన బొల్లం గణపతి అనే రైతు గారెపల్లి పీఏసీఎస్ శాఖ ద్వారా పంట రుణం పొందారు. పంట రుణం పొందే సమయంలో సంఘం ద్వారా ఇన్సూరెన్స్ చేయించారు. ప్రమాదవశాత్తు గణపతి మృతి చెందడంతో రూ.లక్ష ఇన్సూరెన్స్ క్లైమ్ కాగా పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, పాలకవర్గం సభ్యుల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. సీఈఓ ఎడ్ల సతీశ్, కేడీసీసీబీ బ్యాంక్ మేనేజర్ హరిరామ్‌నాయక్ ఉన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

- నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు నర్సిమూర్తి

వెంకటాపురం(కె): బాండ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సిమూర్తి డిమాండ్ చేశారు. శనివారం వాజేడు, వెంకటాపురం(కె) మండలాల పరిధిలోని మొరుమూరు, బర్లగూడెం గ్రామాలకు చెందిన రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుళ జాతి కంపెనీలు ఒప్పంద మొక్కజొన్న సాగు పేరుతో హైటెక్ విత్తనాలను 250 ఎకరాలకు ఇచ్చి మోసం చేసినట్లు ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో దిగుబడి టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.1.50 లక్షలను కంపెనీల నుంచి ఇప్పిచాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళారులపై చర్యలను తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



మాట్లాడుతున్న నర్సిమూర్తి

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

- ఎస్సై మ్యాక అభినవ్

కాటారం: అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చి అటవీ జంతువులనే వేటాడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు, ఎస్సై మ్యాక అభినవ్ హెచ్చరించారు. గతంలో విద్యుత్ తీగలు అమర్చి వేటకు పాల్పడిన మండల కేంద్రంతో పాటు మండలంలోని గుండ్రాత్‌పల్లికి చెందిన నలుగురిని శనివారం తహసీల్దార్ ఎదుట అటవీ శాఖ అధికారులు బైండోవర్ చేశారు. అనంతరం ఎస్సై అభినవ్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పంట పొలాల చుట్టూ, అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చడం, జంతువులను వేటాడడం నేరమన్నారు. అలాంటి వాటికి పాల్పడితే కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చే వారి సమాచారం ఉంటే అధికారులకు తెలుపాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎస్సై మ్యాక అభినవ్

పైప్‌లైన్‌పై విద్యుత్ స్తంభం



వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో శనివారం మిషన్ భగీరథ పైప్‌లైన్‌పై కొత్త విద్యుత్ స్తంభం వేసినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు. గ్రామంలో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా కొత్తగా స్తంభాలను వేస్తున్నారు. ట్యాంకుకు సమీపంలో రహదారి పక్కన పైప్ లైన్ ఉంది. అక్కడ స్తంభం వేయొద్దని అప్పటికే అక్కడ పనులు చేస్తున్న వారికి చెప్పినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు. అయినా పైప్ లైన్‌పై స్తంభం వేయడంతో సిబ్బంది పైప్ లైన్‌ను కొంత దూరం మార్చి మరమ్మతు చేశారు.